క్లుప్తంగా

కమ్యూనిటీ హాలు నిర్మించాలని కలెక్టర్‌కు వినతి

కొత్తపట్నం: మండలంలోని సంకువారిగుంటలో ఎస్సీ సామాజికవర్గానికి కమ్యూనిటీ హాలు నిర్మించాలని కోరుతూ సోమవారం ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో ఆ గ్రామస్తులు వినతి పత్రం అందించారు. గ్రామంలో అందరూ ఎస్సీ కులానికి చెందిన వారే ఉన్నారని, మౌలిక వసతులు లేవని తెలిపారు. ముఖ్యంగా తమకు కమ్యూనిటీ హాలు కావాలని కోరుతూ కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. కలెక్టర్ స్పందిస్తూ ఎస్సీ కోటాలో వచ్చే నిధులతో కమ్యూనిటీ హాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అర్జీ ఇచ్చిన వారిలో దుగ్గిరాల విజయకుమార్, పి.తిరుపతి, సీహెచ్ నరేంద్రబాబు, పి.బాబు, పిల్లి సురేష్‌బాబు, ఎస్.జ్యోతి, టి.హైమావతి తదితరులు ఉన్నారు.

మన్నం సంస్మరణ సభను జయప్రదం చేయండి

చీమకుర్తి: కేఎన్‌పీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మన్నం ప్రసాద్ సంస్మరణ సభను జయప్రదం చేయాలని ఆ సంఘ నాయకులు ఆరెటోటి రాంబాబు, గంటినపల్లి పోతురాజు కోరారు. సోమవారం చీమకుర్తిలో సంస్మరణ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 10వ తేదీ ఒంగోలులోని సీపీఐ కార్యాలయంలో మన్నం ప్రసాద్ సంస్మరణ సభ జరుగుతుందని, కేఎన్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా వాసవీ వారోత్సవాలు

ఒంగోలు మెట్రో: వాసవీ క్లబ్ అంతర్జాతీయ సేవా సంస్థ వ్యవస్థాపకుడు స్వర్గీయ కల్వకుంట్ల చంద్రసేనగుప్త జయంతి సందర్భంగా వాసవీ వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వాసవీ క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ ఆదేశాల మేరకు ఒంగోలు సిటిజన్స్ అధ్యక్షుడు భూమా శ్రీనివాసరావు నేతృత్వంలో ఉదయం కల్వకుంట్ల చంద్రసేనగుప్త జయంతి సందర్భంగా స్థానిక మిరియాలపాలెం సెంటర్ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా క్లబ్ అధ్యక్షుడు భూమా శ్రీనివాసరావు, నీరజ దంపతులు 108 పర్యాయాలు వాసవీ గాయత్రి మంత్రం పఠించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో వీసీఐ జిల్లా 205 అధికారులు దర్శి మనోహర్ చంద్రశేఖర్, తుమ్మపూడి ఏడుకొండలు, క్లబ్ కార్యదర్శి మద్దాలి శివప్రసాద్, కోశాధికారి బియ్యపు సంపత్ కుమార్, పూర్వ అధ్యక్షుడు రాధా రమణ గుప్తా జంధ్యం తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలి

పెద్దదోర్నాల: విధి నిర్వహణలో డ్రైవర్లు అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగం టీఎస్‌టీయూసీ యర్రగొండపాలెం నియోజకవర్గ అధ్యక్షుడు, సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు షేక్ షేక్షావలి పేర్కొన్నారు. డ్రైవర్స్ డేను పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రైవర్లను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు, రాజకీయ నాయకులకు డ్రైవర్లు ఎంతో నమ్మకస్తులన్నారు. అటువంటి డ్రైవర్లకు సమాజంలో గుర్తింపు లేకుండా పోయిందని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు యంత్రాంగం నడవాలంటే డ్రైవర్లు ఎంతో అవసరమన్నారు. దీంతో పాటు డ్రైవర్లు ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఒక వాహనంలో ప్రయాణించేటప్పుడు ఆ వాహనంలోని అందరి ప్రాణాలకు మనం బాధ్యులుగా ఉన్నామన్న విషయాన్ని మరవకూడదన్నారు. ఆయన యూనియన్ సభ్యులకు పలు సూచనలు చేశారు. వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు తప్పని సరిగా దగ్గర పెట్టుకోవాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ తప్పని సరిగా ఉండాలని, లేదంటే అధికారుల తనిఖీలు నిర్వహించి భారీ జరిమానాలు విధించే అవకాశం ఉందన్నారు. సెల్‌ఫోన్‌లు మాట్లాడుతూ వాహనాలు నడపటం నేరమన్నారు. అతివేగం అనర్థదాయకమన్నారు. కార్యక్రమంలో మండల డ్రైవర్లు పాల్గొన్నారు. యూనియన్ సభ్యులు డ్రైవర్స్ డేను పురస్కరించుకుని మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు.


పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు


లడ్డూను ఊరేగింపుగా తీసుకెళ్తున్న జీ శ్రీనివాసరావు


వినాయక విజయం నాటక ప్రదర్శనలో చిన్నారులు

వైభవంగా గణపతి నవరాత్రులు


రాజపానగల్ రోడ్డులో ఊయలలో బాలగణపతి


భీమరాజువీధిలో ఏర్పాటు చేసిన వినాయకుడు

ఒంగోలు మెట్రో: గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం ఆరోరోజు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఒంగోలు నగరంలో కొలువై ఉన్న భారీ గణపతులను చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్థానిక ప్రగతికాలనీలోని గణపతి మండపంలో సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా సోమవారం వినాయక విజయం నాటకాన్ని చిన్నారులు ప్రదర్శించి అలరించారు. దేవీదేవతల వేషాలతో భక్తులను ఆకట్టుకుని నిర్వాహకుల అభినందనలు అందుకున్నారు.

వినాయక చవితి పూజలో చుండూరి

ఒంగోలు టౌన్: నగరంలోని 50వ డివిజన్ వెంకటేశ్వరకాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, పార్టీ నగర అధ్యక్షుడు కఠారి శంకర్ పాల్గొన్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరికీ విఘ్నాలు తొలగించాలని, విజయాలు అందించాలని ప్రార్థించినట్లు రవిబాబు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సాహంగా వేడుకలు జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు గల్లా దర్గా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్, నాయకులు తోటపల్లి రవి, వేణురెడ్డి, రంగారెడ్డి, కొండలు, యరమాల చక్రపాణి, గల్లా శ్రీరామ్, మారుతి, ముప్పవరపు వాసు, పులుసు సురేష్, దేవా, పీటర్, యోహాను పాల్గొన్నారు.

సూర్యనగర్ లడ్డూ రూ.21,500

చీమకుర్తి: పట్టణంలోని సూర్యనగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం చేతిలో ఉంచిన లడ్డూను స్థానికుడు జీ శ్రీనివాసరావు రూ.21,500కు వేలంపాటలో దక్కించుకున్నారు. కలశం లడ్డూను టీ శ్రీనివాసరావు రూ.2,500కు పాడుకున్నాడు. సోమవారం వినాయకుడి నిమజ్జనం సందర్భంగా వేలంపాట నిర్వహించారు.


గాంధీరోడ్డులో గోల్డ్ అండ్ సిల్వర్ మర్చంట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపయ్య

జగనన్నను మళ్లీ సీఎంను చేసుకోవడమే లక్ష్యం


బొట్ల రామారావును సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బొట్లా రామారావు

ఒంగోలు టౌన్: జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడమే మనందరి లక్ష్యంగా పనిచేద్దామని, అందుకోసం వైఎస్సార్ సీపీని బలోపేతం చేసుకుందామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొట్లా రామారావు పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ బీసీ విభాగం కార్యాలయంలో బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు ఆధ్వర్యంలో సోమవారం బొట్లా రామారావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో 95 శాతం అమలు చేసిన ఘనత జగనన్నకు మాత్రమే దక్కుతుందన్నారు. ఆయన పాలనతోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు, ఎమ్మెల్యేలు ఓపెన్ కొంటర్లు పెట్టి అవినీతిలో సిక్సర్లు కొడుతున్నారని మండిపడ్డారు. కూటమి పాలకులు ఒక్క హామీ కూడా అమలు చేయడం లేదని, కక్ష సాధింపులు, కేసులతో కాలం వెళ్లబుచ్చుతున్నారని ఆరోపించారు. చంద్రబాబు సర్కార్ ప్రజలను మోసం చేసిందని, సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని చెప్పారు. బీసీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని ఇంతవరకు అమలు చేయలేదని, కేవలం ఓట్ల కోసమే హామీల ఎర వేసారు తప్ప బీసీలపై కూటమి పాలకులకు ప్రేమ లేదని అన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఫ్లోర్‌లీడర్ ఇమ్రాన్‌ఖాన్, మున్సిపల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావలి శివ, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొగ్గుల శ్రీనివాసరెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ, మహిళా నాయకురాలు మాధవి, నాయకులు ఫణిదపు సుధాకర్, జిలానీబాషా, 15వ డివిజన్ అధ్యక్షుడు వీసం బాలకృష్ణ, పిగిలి శ్రీను, చంటి, మల్లవరపు కోటిరెడ్డి, ఈదా వెంకటరెడ్డి, కొణిజేడు ఎంపీటీసీ బుర్ర అంకరాజు, తొట్టెంపడి సురేష్, ఆనం శ్రీనివాసరెడ్డి, దుద్దంటి శేషుబాబు, యర్రా దశరథరామయ్య, కొండూరి నవీన్ రెడ్డి, కలికివాయి ఉమా, మస్తాన్‌రావు, స్వర్ణ శేషయ్య, గుడ్డల వెంకటేశ్వర్లు, కరుణాకర్, దాసరి వీరయ్య, చిన్నా, దావులూరి సునీల్, ఊళ్లపాలెం వెంకారెడ్డి, బొడ్డు వేణు, భాను, స్వామి, ఉప్పలపాటి శ్రీనివాసరాజు, పందిల్ల గోపి, పసుమర్తి బాబు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల తరపున పోరాడితే కేసులా..?

- వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున ఆగ్రహం


పెద్దకొత్తపల్లిలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: రైతుల పక్షాన పోరాడే వైఎస్సార్ సీపీ నాయకులపై కూటమి ప్రభుత్వ పాలకులు అక్రమ కేసులు పెట్టిస్తున్నారని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున ధ్వజమెత్తారు. మద్దిపాడు మండలం పెద్దకొత్తపల్లి గ్రామంలో సోమవారం బాబు షూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. మేరుగు నాగార్జున పాల్గొని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏడాదిన్నర పాలనా కాలంలో రైతుల సమస్యలు అన్నీఇన్నీ కాకుండా ఉన్నాయన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ఇవ్వకపోవడంతో తీవ్రంగా నష్టపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా ఎరువుల కొరతతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రైతాంగం గురించి కూటమి ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని మేరుగు నాగార్జున మండిపడ్డారు. అనంతరం చంద్రబాబు ఎన్నికల హామీలపై క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాగులుప్పలపాడు మండల అధ్యక్షుడు పోలవరపు శ్రీమన్నారాయణ, జిల్లా అధికార ప్రతినిధి బెజవాడ శ్రీరామమూర్తి, మహిళా విభాగం మద్దిపాడు మండల అధ్యక్షురాలు మన్నం సంధ్య, మంద ప్రసాద్, ఎంపీటీసీ మంద సమాధానం, మందా చిన్నబొమ్మల రామలింగేశ్వరరావు, పల్లపాటి అన్వేష్, పైడిపాటి వెంకట్రావు, కందుల డానియల్, దుడ్డు వినోద్ కుమార్, కంకణాల సురేష్, నాదెండ్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్కో బ్యారన్‌కు 4 నుంచి 5 లక్షల నష్టం

- జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటి వరకు 11 మంది రైతుల ఆత్మహత్య
- బీజేపీ 11 ఏళ్ల పాలనలో 1,40,000 మంది రైతులు ఆత్మహత్య
- రైతు సంఘ జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు ఆవేదన


కార్యక్రమంలో మాట్లాడుతున్న రైతు సంఘ జిల్లా కార్యదర్శి వెంకట్రావు

చీమకుర్తి: రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని రైతు సంఘ జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం పొగాకు రైతులు ఒక్కొక్క బ్యారన్‌కు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు నష్టపోయారని ఆవేదన చెందారు. సోమవారం చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన రైతు సంఘ మండల స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటి వరకు 11 మంది రైతులు నష్టాలలో కూరుకుపోయి ఆత్మహత్య చేసుకున్నారన్నారు. బీజేపీ 11 ఏళ్ల పాలనా కాలంలో దాదాపు 1,40,000 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. పొగాకు కొనుగోళ్లకు బేళ్లను తీసుకెళ్తే లో గ్రేడ్ పొగాకును తిప్పి పంపిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే మాబు మాట్లాడుతూ రైతుల భూములను కొల్లగొట్టి కార్పొరేట్ శక్తులకు అప్పగించే ధోరణిలోనే ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. కరేడు ప్రాంతంలో 8,438 ఎకరాలను ఇండోసోల్ కంపెనీకి అప్పగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలుత రైతు సంఘ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బెజవాడ శ్రీనివాసరావు, పల్లాపల్లి ఆంజనేయులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణ

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడు మండలంలోని రెడ్డిపాలెం సమీపంలో సర్వే నంబర్ 393లో గల డొంక పోరంబోకు భూములను సమీప రియల్ ఎస్టేట్‌దారులు దర్జాగా ఆక్రమిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూములను పరిరక్షించాలని పేర్నమిట్టకు చెందిన మందా శేఖర్‌బాబు సోమవారం సంతనూతలపాడు రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.ఎల్.నారాయణరెడ్డికి వినతిపత్రం అందించారు. గత పెరల్ ఫ్యాక్టరీ వెనుక వైపు దర్జాగా డొంక పోరంబోకు భూమిని ఆక్రమించి ఫెన్సింగ్ వేసుకుని చెట్లు నాటారన్నారు. గతంలో కూడా దీనిపై ఫిర్యాదు చేయగా, నేటికీ రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోలేదని శేఖర్‌బాబు ఆరోపించారు. అదేవిధంగా పేర్నమిట్ట పరిధిలోని ఒంగోలు – కర్నూలు జాతీయ రహదారి సమీపంలో గల చెరువు భూమిని స్థానికులు ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా అధికారులు చర్యలు తీసుకుని లక్షల రూపాయల విలువచేసే ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరారు.


ఆక్రమణకు గురైన ప్రదేశం

నేడు వైఎస్సార్ వర్ధంతికి తరలిరావాలి

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం సంతనూతలపాడులో నిర్వహించే కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని పార్టీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వమత ప్రార్థనలు, అన్నదానం చేయనున్నట్లు చెప్పారు. ముఖ్య అతిథులుగా పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

చీమకుర్తి మండలంలో ప్రత్యేక కార్యక్రమాలు...

చీమకుర్తి/చీమకుర్తి రూరల్: వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా చీమకుర్తి పట్టణంలో, మండలంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు తెలిపారు. చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపం వద్ద, పోలీస్ స్టేషన్ వద్ద, గాంధీనగర్, ఎస్‌పీ కాలనీల వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి మేరుగు నాగార్జున ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

బంగారు చైన్ చేసిస్తానంటూ మోసం

- ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేసిన బాధితురాలు

ఒంగోలు టౌన్: బంగారు చైన్ చేయించుకునేందుకు గాంధీ రోడ్డులోని దుకాణానికి వెళ్తే రూ.3 లక్షల నగదుతోపాటు పాత చైన్ కూడా తీసుకున్నాడని, రోజులు గడుస్తున్నా స్పందించడం లేదని ఇందిరమ్మ కాలనీకి చెందిన ఒక మహిళ ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో ఎస్పీని కలిసిన బాధితురాలు తనకు జరిగిన మోసాన్ని వివరించి న్యాయం చేయాలని కోరారు. అలాగే చీటిపాట పేరుతో డబ్బు వసూలు చేసి ఇవ్వకుండా మోసం చేశారని గుండాయపాలేనికి చెందిన మహిళ ఫిర్యాదు చేశారు. ఆటో ఫైనాన్స్‌లో హోండా షైన్ బైకు తీసుకుని నగదు మొత్తం చెల్లించినా ఎన్‌ఓసీ ఇవ్వకుండా వేధిస్తున్నారని నగరంలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన బాధితుడు ఫిర్యాదు చేశారు.

ఇలా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. చట్టపరంగా విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఆయా పోలీసు స్టేషన్ అధికారులను ఆదేశించారు. మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ రమణ కుమార్, ఎస్సీ ఎస్టీ సెల్ సీఐ దుర్గా ప్రసాద్, సీసీఎస్ సీఐ జగదీష్, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, మీ కోసం ఎస్సై జనార్దన్‌రావు పాల్గొన్నారు.

తాళ్లూరు మండలాన్ని ప్రకాశంలోనే కొనసాగించాలి

తాళ్లూరు: మండలాన్ని ప్రకాశం జిల్లాలోనే కొనసాగించాలని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు కైపు అశోక్‌రెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు కొర్రపాటి విష్ణు సోమవారం ఓ సంయుక్త ప్రకటనలో కోరారు. మండల వాసులకు రోజువారి అవసరాలతో పాటు అత్యవసరంగా పనుల రీత్యా వాహన సదుపాయం ఉండటంతో సులభంగా జిల్లా కేంద్రం ఒంగోలుకు వెళ్తున్నారని గుర్తు చేశారు. మండలాన్ని మార్కాపురం జిల్లాలో కలిపితే వందల కిలో మీటర్ల ప్రయాణంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ఎప్పటిలాగే తాళ్లూరు మండలం ప్రకాశం జిల్లాలోనే కొనసాగేలా చూడాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.